సంప్రదాయబద్ధంగా కోడి పందేలు



ఆకివీడు: కాలుదువ్వుతున్న పందెం కోళ్లు



కాళ్ల: పెద అమిరంలో కోడి పందేలను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, గోకరాజు రామరాజు



కోడి పందేలలో డబ్బులు లెక్కిస్తున్న దృశ్యం

- జోరుగా కోడి పందేలు
- యథేచ్ఛగా పేకాట, గుండాట

ఆకివీడు: సంక్రాంతి పురస్కరించుకుని భోగి పండుగ రోజు కోడి కాలు దువ్వి.. కత్తి దూసింది. మండలంలో పలు చోట్ల యథేచ్ఛగా పందేలు కొనసాగాయి. భారీ టెంట్లు వేసి పందేలు నిర్వహించారు. పందెంలో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక, తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు. మొదటి రోజు మండలంలో రూ.3 కోట్లకు పైగా పందేలు జరిగినట్లు పందెగాళ్లు అంచనా వేస్తున్నారు. కోడి పందేలు జరుగుతున్న ప్రాంతంలో పేకాట, గుండాట ఆడేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ అనుమతులు రాలేదంటూ మధ్యాహ్నం వరకూ జూద క్రీడ జరగలేదు. దీంతో ఆయా పందిళ్లు వెలవెలబోయాయి. సాయింత్రం నుంచి గుండాట, పేకాట యథేచ్ఛగా కొనసాగింది. సంక్రాంతి రోజు కూడా పందేలు కొనసాగేలా ఏర్పాటు చేశారు.

ఊరూ వాడా ఒక్కటై..

కాళ్ల: ఊరూ వాడా ఒక్కటై.. బంధుమిత్రులు ఏకమై సంబరంగా జరుపుకునే తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి. భోగి మంటల సాక్షిగా చెడును దహనం చేసి, సంతోషాల కాంతిని ఇంటి నిండా నింపుకుని సుఖసంతోషాలు, విజయానందాలతో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు చేసుకోవడం ఆనవాయితీ. దీనిలో భాగంగా జిల్లాలో కోడి పందేలు కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. మొదటి నుంచి అనుకున్నట్లుగానే కోడి పందేలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భోగి రోజు ఉదయం నుంచే మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా మండలంలోని పేద అమిరం సీసలి గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బరులలో పెద్ద ఎత్తున పందేలు నిర్వహించారు. ప్రధానంగా పెద అమిరం గ్రామంలో నిర్వహించిన కోడి పందేలను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, గోకరాజు రామరాజు కోడి పందేలను ప్రారంభించారు. సీసలి గ్రామంలో నిర్వహించిన కోడి పందేల్లో ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ఆదేవిధంగా సీసలి, పెద అమిరం, కాళ్ల, జక్కరం, ఏలూరుపాడు, కాళ్లకూరు, జువ్వలపాలెం, మాలవానితిప్ప తదితర గ్రామాల్లో యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహించారు. ఆదివారం కోడి పందేలు నిర్వహణలో భాగంగా ఆలస్యంగా మధ్యాహ్నం నుంచి పేకాట, గుండాటలు జోరుగా సాగాయి. ఈ పందేల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. పందెం రాయుళ్ల కోడి పందేలు చూసేందుకు పందేలు కాసేందుకు ఎగబడ్డారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన పందేల్లో కోజాలు అధిక రేట్లు పలికాయి. కోడి పందేలను తిలకించేందుకు తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి ప్రముఖులు హాజరయ్యారు. రహదారులన్నీ పందెం రాయుళ్లతో నిండిపోయాయి. ప్రధానంగా పెద అమిరం, సీసలి గ్రామంలో రాత్రి సమయాల్లో కూడా పందేలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఫ్లడ్లైట్ల వెలుగుల్లో ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా కోడి పందేలు వీక్షించేందుకు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: న్యాయస్థానం కన్నెర్ర చేసినా, పోలీసులు పదే పదే హెచ్చరించినా కోడి పందేలు సంక్రాంతి తొలిరోజు ఆదివారం నుంచి మొదలు పెట్టేశారు. సంప్రదాయానిదే పైచేయి అయ్యింది. మండలంలోని పాలకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు, మోగల్లు, శృంగవృక్షం, కోరుకొల్లు, వేండ్ర, పెన్నాడ, విస్సాకోడేరు తదితర గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. పెద్ద పెద్ద బరులు, షామియానాలు వేసి ఏర్పాటు చేశారు. పేకాట, గుండాట, రాత్రిళ్ళు కూడా లైటింగ్‌లో ఆటలు సాగాయి.

వీరవాసరం మండలంలో కోడి పందేలు

వీరవాసరం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో కోడి పందేల పెద్ద ఎత్తున నిర్వహించారు. మండల కేంద్రం వీరవాసరంతో పాటు రాయకుదురు, జొన్నలపాలెం, నవుడూరు, అండలూరు, మత్స్యపురి, మత్స్యపురిపాలెం తదితర గ్రామాల్లో కోడి పందేల్లో లక్షల రూపాయలు చేతుల మారాయని, పందెం రాయుళ్లు చెబుతున్నారు. కోడి పందేల ముసుగులో పేకాటలు, గుండాటలు, పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పేరుతో యువత కోడి పందేలు, పేకాట, గుండాటలకు పాల్పడటాన్ని పోలీసులు నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు. కోజాలకు డిమాండ్‌గా ఉందని మాంసాహార ప్రియులు తెలిపారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు వద్దే వద్దంటూ పోలీసులు, అధికారులు పదే పదే ప్రచారం చేసినప్పటికీ పందెంరాయుళ్లు పట్టించుకోలేదు. మండలంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఈలంపూడి, యనమదుర్రు,బరువానిపేట తుందుర్రు, తాడేరు తదితర గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. వీటితో పాటే పేకాటలు, గుండాటలు జోరుగా సాగాయి. దీంతో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. వీటికి అనుబంధంగా చికెన్‌పకోడి దుకాణాలు, కూల్ డ్రింక్స్, గుట్కా, వాటర్ ప్యాకెట్లు అధిక ధరలకు విక్రయాలు జరిగాయి.

క్లుప్తంగా

సాహస శిబిరానికి బీవీ రాజు కళాశాల విద్యార్థి ఎంపిక



జి.దుర్గా గణేష్

భీమవరం: క్రీడా మంత్రిత్వ శాఖ నిర్వహించిన సాహస శిబిరానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరఫున భీమవరం బీవీ రాజు కళాశాల విద్యార్థి జి.దుర్గా గణేష్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐఆర్‌కే రాజు ఆదివారం తెలిపారు. ఇతర కళాశాలల నుంచి 9 మంది విద్యార్థులు ఎంపిక కాగా వీరిని శిబిరానికి పంపించారని తెలిపారు. విద్యార్థులు ప్రమాదవశాత్తూ నదీ జలాల్లో, ఇతర జలాల్లో మునిగిపోతే రెస్క్యూ మెళకువలను నేర్చుకోవడ ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమన్నారు. దీనిలో భాగంగా స్విమ్మింగ్, క్యాకింగ్, సర్ఫింగ్, బోటింగ్, ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇస్తారన్నారు. శిబిరానికి ఎంపికైన దుర్గా గణేష్‌ను అభినందించారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: పండుగలు, మన ఇళ్లల్లో శుభకార్యాలు జరిగినపుడు సమాజంలో ఉన్న పేద కుటుంబాల వారికి చేతనైన సహకారం అందించడం నిజమైన పండుగగా భావించాలని ఇంటర్నేషనల్ అలయన్స్ క్లబ్ మల్టిపుల్ చైర్మన్ పి.సుభద్ర దేవి అన్నారు. డిస్ట్రిక్ 110 ఇంటర్నేషనల్ అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భీమవరం తాడేరు రోడ్డులోని, ఇందిరమ్మ కాలనీలోని 80 మంది పేద కుటుంబాల వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ అలయన్స్ క్లబ్ సౌత్ చైర్మన్ సుభద్రాదేవి పిలుపుమేరకు క్లబ్ సభ్యులు సేకరించిన దుస్తులను 80 మందికి అందించారని మరిన్ని సేవా కార్యక్రమాలతో క్లబ్ సభ్యులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, గమీని రమ్య, మైధిలి, భాగ్యలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మహంకాళమ్మ ఉత్సవాలను ప్రారంభించిన మంత్రి కొట్టు



అమ్మవారికి సారె తీసుకెళ్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక సీతారాంపేటలో వేలసిన శ్రీ మహంకాళమ్మ ఉత్సవాలను ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు, చీరసారెను ఆయన సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు మాట్లాడుతూ నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు 44 ఏళ్ళుగా నిరాటంకంగా ఉత్సవాలను నిర్వహించడంఅభినందనీయమన్నారు.

వాండ్రంలో పట్టభద్రుల సమ్మేళనం

ఉండి: మండలంలోని వాండ్రం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహించే పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం గ్రామ సర్పంచ్ దాసరి వెంకకృష్ణ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పట్టభద్రులతో గ్రామాభివృద్ధి, విద్యాభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి సత్యనారాయణ, ఆర్అండ్‌బీ డీఈ వర్మ, కనకదుర్గారావు, కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ యాడంగి సుజాత ఏసు, ఉప సర్పంచ్ స్వరూపాశ్యాం తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంక్రాంతి పురస్కరించుకుని ఎస్సై బి.మోహన్‌రావు తన సిబ్బందితో ఆదివారం పేకాట శిబిరాలపై దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8,120 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

హోరాహోరీగా జూదం

ఉండి: మండలంలో భోగి పండుగను పురస్కరించుకుని ప్రారంభమైన కోడి పందేలు జాతరను తలపించాయి. ముఖ్యంగా ఉండి, యండగండి, మహదేవపట్నం, కోలమూరు, చినపుల్లేరు తదితర గ్రామాల్లో నిర్వహించిన కోడి పందేలు విద్యుత్ దీపాల వెలుగుల్లో కూడా కొనసాగాయి. ముఖ్యంగా పందెం బరుల వద్ద మద్యం ఏరులై పారింది. బరుల వద్ద నిర్వహించిన గుండాట, పేకాట వంటి జూద క్రీడల్లో పందేలు వేశారు. మండలంలో ఇంత జూదం జరుగుతున్నా పోలీసులు కనుచూపు మేర కూడా కానరాలేదు. దీంతో జూదగాళ్ళు మరింత రెచ్చిపోయి రాత్రీపగలు అడ్డూఅదుపు లేకుండా లక్షల్లో పందాలు కాస్తున్నారు. ఆదివారం ఒక్కరోజే కోట్లల్లో చేతులు మారాయంటే అతిశయోక్తి కాదు.

కోడి పందేలు వేస్తున్న నలుగురి అరెస్ట్

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ జె.శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని అనాకోడేరు కాలువ గట్టున ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద 1,300 నగదు, కోడిపుంజు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రాయలం గ్రామ శివారులో జగదీష్ మెరైన్స్ వద్ద ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 1,400 నగదు, కోడిపుంజు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా భోగి పండుగ

తణుకు అర్బన్: తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన సభ్యులు భోగి మంట వేశారు. స్థానికంగా ఉన్న ఎండిన చెట్లను తీసుకువచ్చి భోగి మంట రాజేసి భోగి పిడకలు వేసి శాస్త్రోత్తకంగా భోగి మంటను వేసి సందడి చేశారు.

కోదండ రామునికి 108 రకాల సారె సమర్పణ



స్వామివారికి సారె తీసుకెళ్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని శ్రీకోదండ రామాలయం లోని స్వామి వారికి 108 రకాల పిండి వంటకాలు, పసుపు కుంకుమలతో సారె సమర్పించారు. పట్టణానికి చెందిన చినిమిల్లి వారి కుటుంబ సభ్యులు మహిళలతో ఉరిగెంపుగా సారెను తీసుకెళ్లారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామివారికి సారెకు పూజలు చేసి ఊరేగింపు నిర్వహించారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



ఆకివీడు: వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు



కాళ్ల: స్వామివారి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: గోదారంగనాథుల కల్యాణం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో వైభవోపేతంగా ఆదివారం జరిగింది. శ్రీకృష్ణుడు శ్రీ రంగనాథునిగా అవతరించి, మానవమూర్తి అయిన గోదాదేవితో భోగి పండుగ రోజు కల్యాణం జరగడంతో ప్రతి ఏటా గోదారంగనాథుల కల్యాణాన్ని విష్ణు ఆలయాల్లో అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో కల్యాణోత్సవం సందర్భంగా గీతా మహిళా మండలి అధ్యక్షురాలు కోసూరి రాజ్యలక్ష్మి(అక్కయ్య) మాట్లాడుతూ మానవ జన్మ ఎత్తిన గోదాదేవి కఠోర దీక్ష, భక్తిపారవశ్యంతో చేసిన వ్రతానికి శ్రీకృష్ణుడు శ్రీ రంగనాథుని అవతారమెత్తి గోదాదేవిని శ్రీరంగంలో వివాహమాడుతాడని పురాణాలు చెబుతున్నాయన్నారు. ఆమె ఆధ్యాత్మిక తత్వాన్ని, దీక్షను ప్రతి మహిళ పాటించి భగవంతుని అనుగ్రహం పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, గీతా మహిళా మండలి ప్రతినిధులు, అర్చకులు శేషాచార్యులు పాల్గొన్నారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

కాళ్లకూరు గ్రామంలో..

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో వేంచేసి యున్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం నందు భోగి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ గోదారంగనాథుల కల్యాణం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కాళ్లకూరు వాస్తవ్యులు మద్దాలి తిరుమల వెంకటేశ్వర్లు(బుజ్జి) దంపతులతో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కారులో నగదు బ్యాగ్ చోరీ

కాళ్ల: నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఇంటి వద్ద నిలిపి ఉన్న కారు అద్దాలు పగలగొట్టి నగదు అపహరణకు గురైనట్లు వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో ఉన్న ఎంపీను కలిసేందుకు పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామానికి చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు ఆదివారం మధ్యాహ్నం వచ్చారు. ఎంపీ రఘురామకృష్ణంరాజును కలిసేందుకు ఇంటి ముందు కారు నిలిపి లోపలికి వెళ్లారు. తిరిగి మళ్లీ బయటికి రాగా తన కారు ఎడమవైపు ముందు భాగంలో అద్దాలు పగలగొట్టి కారులో ఉన్న బ్లూ కలర్ బ్యాగును అపహరించారన్నారు. ఈ బ్యాగులో సుమారు రూ.2 లక్షల నగదు ఉన్నట్లు తెలిపారు. శ్రీనివాసరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం

తణుకు అర్బన్: శ్రీ ఆండాళ్ గోదాదేవి తిరుకళ్యాణ మహోత్సవం తణుకులో వైభవంగా నిర్వహించారు. తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో వేంచేసి యున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటలకు డాక్టర్ గన్నవరపు శంకర శర్మ, వాడపల్లి చక్రపాణి ఆచార్యులు బ్రహ్మత్వాన ఆలయ అర్చకుడు గోవర్ధనం రవి సత్యకుమార్ పర్యవేక్షణలో గోదాదేవి, రంగనాథుల కల్యాణ ఘట్టం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్తమూరి వెంకటరెడ్డి, పీపీ రంగరాజన్, ఉపాధ్యక్షుడు బొల్లింపల్లి ప్రభాకరరావు, కోశాధికారి పైడిముక్కల వెంకటేశ్వరరావు, కన్వీనర్ ఎన్.రామిరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): ధనుర్మాస ఆఖరి రోజు భోగి పురస్కరించుకుని ఆదివారం స్థానిక శ్రీ కృష్ణయోగ ధ్యాన మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మకు పరివార దేవతలకు పూజలు జరిగాయి. అనంతరం గోదారంగనాథ కళ్యాణం వైభవంగా జరిగింది. అష్టోత్తర పూజలు, భోగిపళ్ల సామూహికంగా సమర్పించారు. ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

భోగి సంబరాలు

వీరవాసరం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఆదివారం గ్రామంలోని వాడవాడలా భోగి మంటలను పెద్ద ఎత్తున వేశారు. పిల్లలు, పెద్దలు ఆవు పేడతో చేసిన పిడకల దండలను మంటల్లో వేసి ఆనంద పరవశులయ్యారు. ప్రతి ఇంటి ముందు చక్కటి రంగవల్లులతో తీర్చిదిద్దుకుని మహిళలు ఆనందంగా గడిపారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: సంక్రాంతి సందర్భంగా మొదటి రోజు ఆదివారం భోగి పండుగను ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు జరుపుకున్నారు. దిరుసుమర్రు, యనమదుర్రు, రాయలం, చినఅమిరం, తాడేరు, బేతపూడి, తుందుర్రు, కొమరాడ, అనాకోడేరు, దొంగపిండి, కొత్తపూసలమర్రు, గూట్లపాడు, గొల్లవానితిప్ప తదితర గ్రామాల్లో వీధి వీధిన భోగి మంటలు వేశారు. చిన్నారులు తెల్లజామునే తలంటి స్నానం చేసి కొత్త బట్టలు ధరించి, ఆవు పేడతో చేసిన భోగి దండలు మంటల్లో వేశారు. సాయంకాలం మహిళలు తమ చిన్నారులకు భోగిపళ్ల పోశారు.